# రాజముద్రిక

నవరత్నఖచిత మైనటువంటి బంగారు కంకణాలు ధరించిన ఒకానొక సుకుమారపు ఆడచెయ్యి వజ్రవైఢూర్యాలు తాపడంచేసిన దంతపుపెట్టె తెరిచింది. దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఆ కంకణాల కాంతులతో పెట్టెలో ఉన్నటువంటి వస్తువు కనబడుతుంది కదా అని ఆ జవరాలి కళ్లుచూస్తే ఏమిటి కనపడిందయ్యా అంటే?—

ఖాళీపెట్టె !!!

అయినా ఆ నెరజాణ తొణికిందా? వెణికిందా, కెవ్వున అరచిందా, గాభరా పడిందా?

లేదు.

పోయినవస్తువు పుల్లా? కాదే! దక్షిణాపథాని కంతటికి ఏకఛత్రాధిపత్యం స్థాపించుకొనినటువంటి సర్వంసహాచక్రవర్తి సంతకానికి ప్రత్యామ్నాయచిహ్నం! సాక్షాత్తూ శ్రీకృష్ణదేవరాయలవారి రాజముద్రిక !!

ఆ ముద్రిక నిశాని ఏ కాగితంపైన ఉంపించితే ఆ కాగితం రాజశాసనం అయిపోతుంది.

మండలాధిపతిని లేక బికారిగా, మామూలువాడిని మండలాధిపతిగా మార్చేయుగలశక్తి దాని కున్నది

అది ఎవరిచేతిలోవుంటే వాళ్ళు సర్వాధికారాలుగల సార్వభౌమునికి బదులుగా శ్రీముఖాలు జారీచేయవచ్చు.

అటువంటి రాజముద్రిక కనబడకుండాపోతే ఆ అబల చీమకుట్టినట్టయినా బాధ పొందలేదు.

పేటిక నెలాగయితే చప్పుడు చేయకుండా తెరిచిందో, అలాగే సవ్వడి కాకుండా మూసివేసింది.

పట్టు దూదిపరుపులమీద, మెత్తని పాదాలతో అడుగులు కొలుచుకుంటున్నట్టు అతి సుతారంగా నడిచింది. బాలిసుల నానుకొని కూర్చున్న ప్రియుడి ఒడిలోకి వాలిపోయింది. అతడి చెక్కిలిపై తన చెక్కిలి చేర్చింది. అతడి నల్లని చెక్కిళ్ళపై ఆమె పసిడివన్నె బుగ్గలు చేరేసరికి ఎలాగ కనబడుతుందంటే పదారువన్నె మేలిమిముద్ద గీటురాయిమీద ఉన్నట్టు గోచరిస్తుంది.

ఆ వగలాడి తన్నేలినవాడి చెక్కిలిపై తన చెక్కిలి చేర్చి వూరుకొందా! లేదు. అతడి చెవివద్దకు తన పెదవుల పోనిచ్చింది. 'నాయనా! కొంప మునిగింది, రాజముద్రిక పేటికలో లేదు' అని మెల్లిగా చెప్పింది.

అతడు 'హేమాంగీ!' అని అంతే మెల్లగానూ ఆశ్చర్యం చెందాడు.

ఆ నాయడు నాగమనాయడు. శ్రీకృష్ణదేవరాయల వారి తోశేఖానా అధికారి.

హేమాంగి ఈ నాయనింవారి ఉంపుడుగత్తెలలోకల్లా ఇంపైన సొంపైన అందకత్తె.

పాండ్య, చోళ రాజ్యాల సరిహద్దుసీమల్లో పచ్చపట్టు గుడారాలు, పందిటి గుడారాలు, చిత్తరువుల గుడారాలు

జడ్డుమోసపు పూల గుడారాలు ఎన్నో ఎడలేకుండా ఎత్తించారు నాయనింవారు.

ఆ గుడారాల నడుమున నలుబది స్తంభాల నామతీగంపు గుడారంలో నాగమనాయనింవారు వెలకొనియున్నారు.

అందులోనే ఈ సంఘటన జరిగింది.

రాజముద్రిక కనబడటం లేదని హేమాంగి చెప్పేసరికి నాయనింవారిమోము తెల్లవారుఝామున తూర్పుదిక్కువలె అయింది.

'అపహరించిన దెవరై యుంటారు?' అని నాయనింవారు అతి నెమ్మదిగా తనలోతాను అనుకొంటున్నట్టు హేమాంగిని అడిగారు.

రెండువేల గుర్రం, ఆరువేల కాల్బలం చుట్టూకాపలా ఖాయించి ఉంటూఉండగా నడిగుడారంలోకి చొరబడి ఎవరు ఈ దొంగతనం చేయడానికి కావలసినంత గుండెధైర్యం గలవారు? రాజముద్రికను అపహరించవలసినంత అవసరం ఏముంది?

నాయనింవారు యోచించారు. మోముతిప్పి హేమాంగివంక సాభిప్రాయంగా చూసి తల పంకించారు. 'నీవు నీ తారహారాన్ని భద్రంచేసే పేటికకూడా అచ్చంగా ఇలాగే వుంటుందికదూ! అది ఇలా తే' అని ఆజ్ఞాపించారు.

హేమాంగి తారహార పేటికని తీసుకొనివచ్చి నాయనింవారియెదట పెట్టింది. తారహారాన్ని తస్కరించ దలచుకొన్నవాడు తనబడి పొరపాటున రాజముద్రికని అపహరించాడేమోనని అభిప్రాయపడ్డారు వారు.

వారు పేటికని తెరిచారు. తళతళా మెరుస్తూ అందులో తారహారం ఉందా? లేదు.

తస్కరుడు రెండూ క్షా జేసినాడు.

ఎందుకు?

తారహారంవల్ల దొంగకు లాభం కలుగవచ్చు. రాజముద్రిక నపహరించడంలో వాడి ఉద్దేశం ఏమిటి?

నాయనింవారికి ఏమీ పాలుపోక తూరుపుదిక్కులాగే వారి తెలివికూడా తెల్లవారిపోయింది. హేమాంగి శ్రీవారి శిరస్సును ఒడిలోకి తీసుకొని నిమురుతూ ఆలోచించింది.

'నాయనా! రాజముద్రికవల్ల ఎవరికి లాభం?' అని ప్రశ్నించి తానే జవాబు చెప్పింది. 'ఆ ముద్రిక ఎవరిచేతిలో వుంటే వారు రాజశాసనాలు చేయవచ్చు. సన్నెలిన నాయనింవారినికూడా రాయలవారు అటువంటి రాజశాసనాలు చేయమనేకదా, ఈ పాండ్య చోళ సరిహద్దుసీమను అంపించారు? ఈ విధమైనటువంటి శాసనాలుచేస్తే ఎవరికి అపకారం కలుగుతుందో వాళ్ళకు రాజముద్రిక తమవద్ద లేకపోయిన పక్షంలో లాభం కలుగుతుంది' అన్నది అతి తగ్గుస్థాయిలో ఆమె.

తగవు పరిష్కరించబడుతున్నప్పుడు యిరుపక్షాలలో ఎవరికో ఒకరికి లాభకరంగానే తీర్పు ఇవ్వక తప్పదు. అటువంటితీర్పు ఎవరికి అనుకూలంగా ఉంటుందో ఇప్పటికి హేమాంగికికూడా తెలియనేయలేదాయె నాయనింవారు. అందుచేత వాదుకి దిగిన పాండ్య, చోళరాజులలో ఏ ఒక్కరో రాజ

ముద్రికను తిరస్కరింపచేసి వుంటారు. ఈ విధంగా తన అభిప్రాయాన్ని నాయనింవారికి హేమాంగి విన్నవించుకొంది.

ఈ విన్నపాలు విన్నవారై వారు ఏమన్నారంటే 'ఈ యిద్దరిలో ఎవరు ఇటువంటి గుండెలుతీసినపని చేశారో ఎలాగు కనిపెట్టడం?

వీరశేఖర చోళున్ని, చంద్రశేఖర పాండ్యుని సముఖానకు రప్పించి అడిగితే తేలేప్రశ్నా ఇది?

రాజముద్రికని అపహరించడం మహాపచారం. పాండ్యుడుగాని, చోళుడుగాని అలా చేసినట్టు వప్పుకొంటారా?

ఒకవేళ ఈవిధంగా పిలిచి అడిగితే నాయనింవారి కెంత నగుబాటు! ఘప్పన్న గుడారాల నట్టనడుమనున్న నలభై స్తంభాల నామతీర్థపు గుడారంలో ఉంపించినటువంటి రాజ ముద్రికను నాయనింవారు కాపాడలేకపోయారన్న వైనం వెలికివస్తే ఇంకేముంది? రాజముద్రికని కాపాడలేకపోవడం రాజ్యాన్ని రక్షించగల స్తోమతలేదని చాటించుకోడమే కదా!

'సాధనం ఏమిటా?' అని నాయనింవారు తలపట్టుకొని యోచించసాగారు. వారిని కన్నువాల్చక చూసింది హేమాంగి. 'దక్షత తగలట్టే ఉన్నది.' అని శ్రీవారు స్వగతంగా విసుక్కొన్నారు.

'తగలడ్డం' అన్నమాట విన్నదై హేమాంగి తన్నేలినవారిని చూసింది. చూసి వారు తలపట్టుకు కూర్చోవడం చిత్తగించింది.

'నాయుడా! తలపట్టుకు కూర్చుంటే ఏం ప్రయోజనం?' అంది.

'మరేం చేయమంటావు?' అని సెలవిచ్చారు నాయనింవారు.

'తలకట్టుకు పడుకోండి' అని సలహా యిచ్చింది ఆ వెరజాణ.

'పడుకొంటే...' అని అర్థోక్తితో అడిగారు వారు.

'తగలడుతుంది!' అందామె.

'ఏమిటి?'

'అది తమకు అనవసరం. నన్నేలిన నాయనింవారికి కావలసినది రాజముద్రిక భద్రంగా తిరిగి రావడం. నామాట వింటే అది జరుగుతుంది' అందామె.

తెప్పపాటుకాలం నాగమనాయనులు హేమాంగిని చూశారు.

తెల్లవారిందని వైతాళికులు గుడారం వెలుపల గానం చేస్తూ నాయనింవారికి మేలుకొలుపులు పాడుతున్నారు.

వారు హేమాంగి సలహాప్రకారం తలకట్టుకు పడుకొన్నారు.

## 2

కృష్ణదేవరాయలవారు కటకం మొదలుకొని కన్యాకుమారిదాకా రాజ్యం యేలుతూఉండగా మధురలో చంద్ర

శేఖరపాండ్యుడున్ను. తంజావూరులో వీరశేఖర చోళుడున్ను రాయలవారికి వశవర్తులై రాజ్యం చేస్తూ ఉండిరి.

ఈ దక్షిణరాజ్యం యావత్తూ విజయనగరం తోశేఖానాకు అడమానం వున్నది. పాండ్యుడిదగ్గరనుంచి, చోళుడి దగ్గరనుంచి కప్పాలు పుచ్చుకుంటూ తోశేఖానా అధికారి నాగమనాయునింవారు రాయలవారిని కొలుచుకుంటూ విజయ నగరంలోనే ఉంటున్నారు.

ఇలా వుండగా,

చోళుడి రాజ్యం కట్టుకొందామని పాండ్యుడు, పాండ్యుడి సింహాసనాన్ని పట్టుకొందామని చోళుడు ఎత్తులు పై ఎత్తులు వేసుకొంటూ వున్నారు. ఒకరి భోగట్టాలు యింకొకరు వేగులవాళ్ళవల్ల విన్నటువంటివారై సరైన సమయం కోసం ఇద్దరూ వేచియున్నారు.

విజయనగరం వేగులవాళ్ళువూరికేవున్నారా? సామంతులిద్దరూ సమర సన్నాహాల్లో నిమగ్నులవుతున్నారని రాయలవారికి వేగులు విన్నపాలు అంపించుకొన్నారు.

ఇలాగ విజయనగరం వేగులవాళ్ళు విన్నపాలు అంపించుకొన్నట్టు చోళుడి వేగులు, పాండ్యుని గూఢచారులు తెలుసుకొన్నటువంటివారై తమతమ ఏలికలకు మనవిచేసుకొన్నారు.

అంతలో ఏం జరిగిందయ్యా అంటే, చోళుడు పాండ్యుడిమీద చాడీలుచెప్పుకొంటూ రాయలవారికి ఫిర్యాదు

చేసుకొన్నాడు. పాండ్యుడు చోళుడిమీద నేరాలుమోపుతూ రాయలవారిపేర కమ్మ వ్రాయించినాడు.

ఈ రెండు అభియోగాలూ విన్నటువంటివారై రాయలవారు తోశేఖానా అధికారి నాగమనాయనింవారిని పిలిపించి, 'దక్షిణదేశం యావత్తూ మీ తోశేఖానాకు అడిమానం వున్నదిగదా! మీరు సైన్యమేతంగా పోయి ఇద్దరి అభ్యర్థనలూ వినండి. తగినట్టుగా తీర్పు యివ్వండి. మీరు చేసిన తీర్పు మేము చేసినట్టే. అందుకు నిదర్శనంగా మా రాజముద్రికను మీ చేతిలోనే ఉంపిస్తున్నాం' అన్నారు.

'మహాప్రసాదం! అని నాగమనాయనింవారు రాజముద్రికను దోసిట పుచ్చుకొన్నవారై, వజ్రవైఢూర్యాలు తాపడంచేసిన దంతపుపెట్టెలో భద్రంచేశారు. నాయనింవారికి రాయలవారు రాజముద్రికను ఇవ్వడం నిండు పేరోలగంలో జరిగింది.

రెండువేల గుర్రం, ఆరువేల కాల్బలం గల రాణువను కూర్చుకొని నాయనింవారు దక్షిణాపథానికి తరలివెళ్ళి పాండ్య, చోళ దేశాల సరిహద్దుసీమలో గూడారాలెత్తించారు.

తమసముఖానికి వచ్చి వినపాలు చేసుకోవలసిందని పాండ్యుడికీ, చోళుడికీ వర్తమానం చేసినారు.

చోళుడు వచ్చి తన గడ్డమీద గుడారాలలో విడిసినాడు.

ఇద్దరూ రోజూ నాగమనాయనింవారి సముఖానికి సపరివారంగా వెళ్ళి తమతమవాదనలు నివేదించుకొంటున్నారు.

ఆరు రోజులా విధంగా వాదనలు విన్నటువంటివారై ఏడో రోజు మాపటివేళ నాయనింవారు ఏమన్నారంటే. 'చోళుడా! నీవు మనవి చేసుకొన్నదీ విన్నాను. పాండ్యుడా! నువ్వు విన్నవించుకొన్నదీ చిత్తగించినాను. రేయి రేయంతా ఆలోచించి రేపు సూర్యోదయ ఘడియలో నా తీర్పు ఫర్మానాగా వ్రాయించి రాజముద్ర వేయించి మీ మీ విడిది గుడారాలకు పంపుతాను.'

ఇది విన్నటువంటివారై చోళుడూ, పాండ్యుడూ 'దేవర చిత్తం, మా భాగ్యం!' అని వెళ్ళిపోయారు.

ఏడోరోజు రాత్రే రాజముద్రిక పోయింది.

ఏ సూర్యోదయఘడియలో ఆజ్ఞాపత్రంగా తమతీర్పును వ్రాయించాలో, ఆ సమయంలోనే నాగమనాయనిం వారు తల కట్టుకుని పడుకొన్నారు.

తమ్మేలినవారికి తలభారం అని సిబ్బందికి తెలిసింది. ఈ వైనం ఆనోటా ఆనోటా పాక్కి పాండ్యుడికీ, చోళుడికీ తెలిసింది. ఇద్దరూ రెక్కలు కట్టుకొని వచ్చి వాలినట్లు నాయనింవారి నలభై స్తంభాలగుడారం వద్దకు చేరుకొన్నారు.

నాయనింవారు మొదట చోళుని లోపలికి రప్పించు కొన్నవారై, 'చోళుడా! నువ్వు విజయనగరానికి నమ్మిన బంటునై రాయలవారిని కొలుచుకొంటానని బాసచేసినావు. మమ్మేలినవారు గీసినగీటుదాటనని మాటిచ్చినావు. నీ సరిహద్దు ఎంతవరకో ఆ మేర దాటనని ప్రమాణం చేసినావు' అని చెప్తూ ఉండగా, 'నిప్పూ! నిప్పూ!' అని నికాయంలో

కేకలు వినిపించాయి. 'నన్నేలిన నాయనా! చిత్తరువుల గుడారం నిప్పంటుకొంది' అని హేమాంగి నాయనింవారి దగ్గరకొచ్చి చెప్పింది. అప్పుడు వా రేం చేశారయ్యా అంటే; తను చేతికి అందుబాటులోనున్న దంతపు పెట్టెని తీసుకొని పరివారం చూస్తూ ఉండగా దానిని చోళుడిచేతిలోపెట్టి, 'ఇది రాయలవారిముద్రిక ఉంపించిన పేటిక. ఏలినవారి నెలాగైతే కొలుచుకొంటానని బాసచేసితివో దీనిని అలాగే కొలుచుకో. నీ విడిదిలో దాచు. గుడారాలు కాలిపోయినా రాజముద్రిక భద్రంగా ఉంటుంది' అన్నారు.

'మహా ప్రసాదం!' అని పేటికను కన్నుల కద్దుకొని చోళుడు కదిలాడు. హేమాంగి అతనిని గుడారంయొక్క పాణిద్వారంవైపు పంపించివేసింది.

అంతట నాయనింవారు పాండ్యుని కూడా లోనికి రప్పించుకొని రాజముద్రిక ఉన్న పేటిక పరశురామ ప్రీతి కామండా కాపాడమని అతడికిన్నీ వప్పచెప్పి సింహద్వారం వైపు పంపించివేశారు.

చోళుడూ పాండ్యుడూ తమ తమ గుడారాలు చేరుకొనేలోగా, నాగమనాయనింవారి గుడారాలలో రేగిన నిప్పు చప్పున చల్లారింది. హేమాంగి తన్నేలినవారి తలకట్టు విప్పి తలంటుపోసింది.

ఆనాటి మాపటివేళ, పంచ మహా వాయిద్యాలతోనూ నెలకొన్న కొలువుతీర్చి రాజముద్రిక ఉంపించిన పేటికను పట్టుకొని రమ్మని పాండ్యునికీ, చోళునికీ విడివిడిగా వర్తమానం చేశారు.

ఇద్దరూ చెరి వక పేటిక పట్టుకొని వచ్చారు. వస్తూనే ఒకరి నొకరు చూసుకొన్నారు. ఎదుటివాని చేతిలోకూడా పేటిక ఉండడం చూసి నివ్వెరపోయారు.

పాండ్యుడిచేతిలోని పేటికను తీసుకొని మన్నీల బొమ్మ నీడు అనే దండనాయకుడు నాయనింవారిముందు ఉంపించాడు.

చోళుడి చేతిలోనిది తీసుకొని అదే విధంగా, మొదటి దాని పక్కనే ఉంపించాడు.

రెండు పేటికలను చూడగానే నిండు పేరోలగం కూడా నివ్వెరపోయింది.

హేమాంగి సుతారంగా నడిచివచ్చి రెండు పేటికలని కొద్దిగా తెరచి చూసి తన్నేలిన నాయనింవారివంక సాభిప్రాయంగా చూసింది.

శ్రీవారు గొల్లున నవ్వారు.

పాండ్యుడూ, చోళుడూ గిజ గిజలాడిపోయారు.

నాయనింవారు అప్పుడు గంభీర వాక్కులతో ఏమన్నారంటే; 'చోళుడా! పాండ్యుడా! మీ రిద్దరూ దుష్టులే. మీ రాజ్యాలతో సంతృప్తిచెందక ఒకరి రాజ్యం ఇంకొకరు కట్టుకొందామనే ప్రయత్నం చేస్తున్నారు. ఏడు రోజులు మీ ఇద్దరి వాదనలూ విన్నటువంటివారై మీ రిద్దరూ దుష్టులనే నిర్ణయాని కొస్తిమి అయితే మీలో ఎవరు అధికంగా దుష్టులో మేము రుజువు చేసేకన్న, మీ చేతులతో మీరే ఆ విధమైనటువంటిని చేసుకోడానికి వీలుకల్పించాలని అభిప్రాయపడితిమి.

'అందుకే నిన్న మాపటివేళ మీ ఇద్దరికీ మేం ఏ మని సెలవిచ్చాం? రాత్రిల్లో ఆలోచించి తెల్లవారుజామున సూర్యోదయ ఘడియల్లో ఆజ్ఞాపత్రం వ్రాయించి అందుపైన రాజముద్రిక ఉంపించుతామని చెప్పాం. మీలో ఎవరు ఎక్కువ దుష్టుడైతే వాడు తనకు వ్యతిరేకంగానే మా తీర్పు ఉండగలదని భావించి భయపడతాడని మాకు తెలుసు. మా తీర్పు రాజశాసనం కావాలంటే దానికింద రాజముద్రిక నిశానీ అవసరం అన్నది మీకు తెలుసు. అందుచేత మీలో ఎక్కువ దుష్టుడు నేటి సూర్యోదయ ఘడియలలోగా రాజ ముద్రికను తస్కరింప చేస్తాడని మేము భావించాం. మేము భావించినట్టే జరిగింది. మీలో ఒకడు, ఆరి తేరిన గజదొంగని ఆ పనికి నియోగించాడు. ఆ దొంగ రాజముద్రికని అపహరించడం మేం కన్నులారా చూస్తిమి. అయినా, భుజబలంతో కాక బుద్ధిబలంతో కూడా రాయల వారిని కొలుచుకొంటున్నాం కనుక మేము తస్కరుని రాజ ముద్రిక దొంగిలించుతూ ఉండగా చూసి చూడనట్టు ఊరు కొన్నాం.

'ఎందువల్ల? మేము చోరుణ్ణి పట్టుకొంటే ఏముంది? వాడు ఒక్కడే దొరుకుతాడు. తనను ఈ మహాపచారానికి నియోగించినవాడేమి చేస్తాడు? చెప్పుము. ఒక నికృష్ట తస్కరుడు తప్పా వాడిని కొలువులో తీసుకున్నవాడు దొర కడు. అందుకే ఊరుకొని మా బుద్ధిబలం ఉపయోగించితిమి.

'ప్రొద్దుట, మీ ఇద్దరినీ నిన్న విడిగా పిలిచి తగు మను ష్యులు చూస్తూ ఉండగా రాజముద్రిక ఉంపించిన పేటిక

అని చెరి వక ఖాళీ పెట్టెను ఇస్తిని. అది రిక్తపేటిక అని మీలో ఒకరికి అప్పటికే తెలుసు. అయినా పైకి పెద్దమను ష్యులవలె నటించాలె కనుక మాటలాడక తీసుకువెళ్ళినారు.

'పొద్దుట మా విడిదినుంచి తీసుకువెళుతున్న పేటికలో రాజముద్రిక ఉందని, తగుమనుష్యులు భావించిరి. కనుక సాయంత్రం మీరు పేటికని తిరిగి తీసుకొని వచ్చాక అందులో అది లేకపోతే ఎవరైనా ఏమనుకొంటారు? ఎవరినైతే సంర క్షించ మన్నామో, అతడే అది ఈనాడు అపహరించాడని అందరూ తలపోస్తారని నిన్నరాత్రి దొంగతనం చేయించిన సామంతుడే ఈ సాయంత్రం దానిని పేటికలో పెట్టి తిరిగి తీసుకువచ్చెను.

'ఎవరి పేటికలో రాజముద్రిక ఉంటుందో వాడే ఎక్కువ దుష్టుడు' అని నాయనింవారు సింహగర్జనవలె పలికేసరికి నిండుపేరోలగం కంపించిపోయింది.

హేమాంగి రెండుపేటికలూ పూర్తిగా తెరిచింది.

పాండ్యుడు తెచ్చిన దానిలోనే సముజ్జ్వలకాంతులతో రాజముద్రిక విరాజిల్లుతోంది.

పాండ్యుని మొఖాన నిజంగా కత్తివేస్తే నెత్తురులేదు. కత్తి వేసినది_నాగమనాయనింవారే.

'పాండ్యుడు పరమదుష్టుడని తేలింది కదా! వాడి రాజ్యం నాకు కట్టబెట్టండి' అని చోళుడు నాయనింవారికి వేడుకోలు చెప్పుకొన్నాడు.

'లేదు. వాడి రాజ్యం నేనే కట్టుకొంటాను. ఎందుకయ్యా అంటే మా ఇష్టవేశ్య తారహారాన్ని పాండ్యుడు నియోగించిన దొంగ తస్కరించాడు. పాండ్యుడి రాజ్యమంతా కలిపి ఆ తారహారం విలువ చెయ్యదు' అన్నారు నాయనింవారు.

'పోనీయండి. నా రాజ్యం నా కుంటే చాలు!' అని చోళుడు అంజలిబద్ధుడై అంటూఉంటే 'నాయనింవారు అడ్డొచ్చి పాండ్యుడిరాజ్యం తారహారానికి సరిపోదు అని సెలవిస్తిమికదా, ఆ విలువకి సరిపడినంత రాజ్యం కట్టుకోవాలె. అందుకు నీ రాజ్యాన్నికూడా మేమే చేపడతాం' అన్నారు.

పాండ్య, చోళ దేశాలు రెండింటినీ ఈ విధంగా భుజబలంతోనూ, బుద్ధిబలంతోనూ నాగమనాయనింవారు వశపర్చుకొన్నారని అందరూ వేనోళ్ళ చెప్పుకొన్నారు.

అయితే, భుజబలం నాయనింవారిది, బుద్ధి బలం హేమాంగిది అని ఇప్పటిదాకా ఎవరికీ తెలియదు.